అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

- ఆర్అండ్‌బీ స్థలంలో రేకుల షెడ్లు తొలగింపు
- పోలీసు బందోబస్తు నడుమ రెవెన్యూ అధికారుల చర్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న మండల ప్రజానీకం



ఆర్ అండ్‌బీ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు



గాలివీడులోని గాంధీ సర్కిల్‌లో బందోబస్తు విధుల్లో పోలీసులు

గాలివీడు : ఆర్అండ్‌బీ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్లు, నిర్మాణాలను రెవెన్యూ, పోలీసు అధికారులు శుక్రవారం నేలమట్టం చేశారు. అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన అధికారులు ఉక్కుపాదం మోపుతూ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే గాలివీడు పట్టణంలోని గేటు నాలుగు రోడ్ల కూడలిలో సర్వే నంబర్ 2266లో ఉన్న 1.80 ఎకరాలు భూమిలో ఆక్రమణ నిర్మాణాలు, దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇదే తరుణంలో స్థానికుల ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్, ఆర్డీఓ ఆదేశాల మేరకు కదిలిన స్థానిక రెవెన్యూ యంత్రాంగం, ఆర్ అండ్‌బీ అధికారుల ఫిర్యాదు మేరకు 11 మంది ఆక్రమణదారులకు తాఖీదులు అందజేశారు. 15 రోజులు గడువు ఇచ్చిన అనంతరం సిక్స్ నోటీస్ ఇచ్చిన అధికారులు పోలీసుల సహకారంతో శుక్రవారం ఆక్రమణకు గురైన స్థలానికి చేరుకుని అక్రమ నిర్మాణాలను జేసీబీ సహాయంతో తొలగించారు. అయితే స్థానికులు కొందరు తమ నిర్మాణాలు తొలగించాలంటే ఎదురుగా ఉన్న మరి కొన్ని అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఎదురుతిరిగారు. దీంతో తహసీల్దార్ భాగ్యలత, ఎస్ఐ రామకృష్ణ సమన్వయంతో వ్యవహరించి ఆక్రమణలను తొలగించారు. మండల కేంద్రంలో ఎక్కడ ఆక్రమణలు ఉన్నా కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు ప్రజలకు తెలియజేశారు. చివరిగా మహాత్మ గాంధీ విగ్రహం చుట్టూ చికెన్ సెంటర్ల తొలగింపు, అక్రమ నిర్మాణాల తొలగింపునకు సంఘీభావంగా స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ అక్కడే ఉన్న గాంధీ మహాత్ముడి విగ్రహాన్ని నీటితో శుద్ధి చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి కాపాడిన రెవెన్యూ, పోలీసు అధికారుల తీరుపై ప్రజలు ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు.

అక్రమనిర్మాణాల తొలగింపులో ఉద్రిక్తత

గత ముప్పై సంవత్సరాలుగా ఆర్ అండ్ బీ స్థలంలో రేకుల షెడ్లు నిర్మించుకుని వ్యాపారాలు, నివాసాలు ఉన్న వారికి రేకుల షెడ్లు తొలగించాలని గత రెండు మాసాలుగా రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. వీటిని ఖాతరు చేయకపోవడంతో రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో ఆక్రమణ నిర్మాణాలను తొలగించడానికి జేసీబీ యంత్రాలతో ప్రయత్నం చెయ్యగా, అక్రమ నిర్మాణదారులు తమ నివాసాలను తొలగించవద్దంటూ అడ్డుకున్నారు. స్థానికుడు ఒకరు రేకుల షెడ్ల పైకి ఎక్కి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటానంటూ పోలీసులను బెదిరిస్తూ హల్ చల్ చేశాడు. దీంతో పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ అతన్ని కిందకు దించి మందలించి పంపించివేశారు.

వైఎస్సార్‌సీపీ అధినేత పుట్టినరోజు వేడుకలకు భారీ ఏర్పాట్లు

రైల్వేకోడూరు అర్బన్ : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు నేడు (శనివారం) ప్రజలు, కార్యకర్తల నడుమ జరపనున్నట్లు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు అందరూ పట్టణంలో పార్టీ కార్యాలయం వద్దకు ఉదయం 8 గంటలకు చేరుకోవాలని తెలిపారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి, అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేయనున్నట్లు తెలియజేశారు.

పుల్లంపేట : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు నేడు (శనివారం) మండలంలో అత్యంత ఘనంగా జరగనున్నాయి. ఉదయం 9 గంటలకు బైపాస్ రోడ్డులోని దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేయడం జరుగుతుందని, అనంతరం మండల సీనియర్ నాయకులు, మండల పరిషత్ అధ్యక్షులు ముద్దా బాబుల్ రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సయ్యద్ ముస్తాక్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్ సీపీ నాయకులు తెలియజేశారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

సంబేపల్లి : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆయా గ్రామాల పరిధిలో శనివారం ఘనంగా నిర్వహించాలని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్ఆర్ అభిమానులందరూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు.

దేశ మూలసంస్కృతిని కాపాడుకుందాం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న బాస్ సభ్యులు

రాయచోటి అర్బన్ : భారతదేశ మూల సంస్కృతిని కాపాడుకుందాం అని భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర కార్యదర్శి పల్లం తాతయ్య పిలుపునిచ్చారు అంబేడ్కర్ సేవ 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సభ్యులు పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ మూల సంస్కృతిని పరిరక్షించడానికి వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న భారతీయ సామాజిక న్యాయపోరాట ప్రస్థానానికి కొనసాగింపుగా ఆవిర్భవించినదే బాస్ సంస్థ అని అన్నారు. శాంతియుత పరివర్తన, రక్తపాత రహిత విప్లవం ద్వారా సమతా రాజ్యాన్ని స్థాపించాలన్న అంబేడ్కర్ ఆశయాన్ని అజెండాగా పనిచేయడానికి బాస్ ఆవిర్భవించిందన్నారు. ఈనెల 20 నుంచి 28 వరకు అన్ని మండలాల్లో వార్షికోత్సవాల్లో భాగంగా కులనిర్మూలన చైతన్య సదస్సులను నిర్వహించనున్నట్లు తెలిపారు. 29వ తేదీన మదనపల్లె పట్టణంలో జరుగబోయే భారీ బహిరంగ సభలో కులదహనం కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్. రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు ఎం.శంకర్ నాయక్, బాస్ రాయచోటి నేతలు రమేష్‌బాబు, పామయ్య, సహదేవ, సుధాకర్, పవన్‌కుమార్, చంద్రమౌళి, సురేంద్రబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి'



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఓబులవారిపల్లె : రాజ్యసభ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, ఆయన భేషరతుగా క్షమాపణ చెప్పాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కొర్లకుంటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతి పత్రం అందజేశారు. అనంతరం రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె మండల కార్యదర్శులు మోడి ఇవయ్య, ఇంతలపూడి నాగమ్మలు మాట్లాడుతూ హామీలు నెరవేర్చకుండా, ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి ప్రణాళికతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలపై హింసకు ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. స్వాతంత్ర్య పోరాటంలో పాత్రలేని బీజేపీ నేతలు దేశం, దేశభక్తి గుర్తించి మాట్లాడే అర్హత లేదన్నారు. అమిత్‌షా ఉద్దేశపూర్వకంగానే భారత రాజ్యాంగం స్థానంలో సనాతన ధర్మాన్ని ఏర్పాటు చేసేందుకే అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. తక్షణం అమిత్‌షా పై చర్యలు తీసుకోవాలని, భారత జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎం ఎల్లయ్య, నరసయ్య, పెద్దన్న, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తాం



ఓబులవారిపల్లె : సమస్యను అధికారులకు తెలుపుతున్న అర్జీదారులు

ఓబులవారిపల్లె : రైతుల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీధర్ రావు పేర్కొన్నారు. శుక్రవారం చెన్నరాజుపోడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూములు సర్వే ఆన్‌లైన్‌కు సంబంధించి సమస్యలపై 30 అర్జీలు వచ్చాయని, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇబ్రహీం, ఎంపీడీఓ మల్‌రెడ్డి, ఆర్ఐ రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : మండలంలోని కొత్తపల్లి అగ్రహారంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 18 దరఖాస్తులు అందాయని డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ ప్రసన్న తెలిపారు. సంబంధిత సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ చిట్టిబాబు, ఆర్ఐ సుశీల్ కుమార్, ప్రజలు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

సిద్దవటం : భూ సమస్యలపై అర్జీలు ఇచ్చిన ప్రతి రైతు సమస్యను పరిష్కరిస్తామని ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత తెలిపారు. మండలం లోని కనుమలోపల్లె గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు చేసిన ప్రతి రైతు సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సుదర్శన్, వీఆర్ఓ శ్యాంబాబు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అడవికమ్మపల్లెలో..

సంబేపల్లి : మండల పరిధిలోని అడవికమ్మపల్లెలో శుక్రవారం ఆర్ఎస్ డీటీ స్రవంతి ఆధ్వర్యంలో సదస్సును అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించడానికి రెవెన్యూను సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతుల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు స్వీకరించి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

అవకతవకలను ఉపేక్షించబోం

ఉపాధి సిబ్బంది తీరుపై మండిపడ్డ పీడీ వెంకటరత్నం



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ వెంకటరత్నం

చిన్నమండెం : 2023–24 మధ్య కాలంలో జరిగిన ఉపాధి పనుల సామాజిక తనిఖీ శుక్రవారం జరిపారు. మండల కేంద్రంలో ఉపాధి కార్యాలయం వద్ద ఈ కార్యక్రమంలో ఆశాఖ పీడీ వెంకటరత్నం హాజరయ్యారు. మండలంలో పనుల్లో జరిగిన అవకతవకలను గుర్తించి సిబ్బంది నుంచి రూ.1,15,276లను రికవరీ చేశారు. కొత్తపల్లి పంచాయతీలో 4625 మొక్కలు అవెన్యూ ప్లాంటేషన్ కింద నాటించి అవి మరణించినా బిల్లులు పెట్టుకున్నారని టెక్నికల్ అసిస్టెంట్‌ను సమావేశంలో పీడీ నిలదీశారు. పనులకు సంబంధించి రికార్డులు సరిగా నమోదు చేయడం లేదని సిబ్బందిపై మండిపడ్డారు. మరికొన్ని చోట్ల ఉపాధి కూలీల సంతకాలు లేకుండా బిల్లులు మార్చారని సామాజిక తనిఖీలలో బయటపడటంతో వాటిని ఎఫ్ఏ, టీఏల వద్ద మొత్తాన్ని రికవరీకి ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి మొత్తం 1486 పనిది నాలు జరగగా సామగ్రి మెటీరియల్ రూ.4,21,96,602 మొత్తం ఖర్చు రూ.13,76,09,165 అని సమావేశం దృష్టికి ఏపీఓ మాధవి తీసుకువచ్చారు. రూ.1,15,276లను రికవరీ చేయాలని పీడీ ఆదేశించగా సమావేశంలో రూ.8,255 రికవరీ చెల్లించగా మిగిలిన సొమ్మును చెల్లిస్తామని సిబ్బంది సమావేశం దృష్టికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ సుబ్బారావు, ఎస్టీఎం లోకేశ్వరరెడ్డి, ఏపీడీ లక్ష్మీనారాయణ, సీఈ సూర్యప్రకాష్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శేఖర్‌నాయక్, ఉపాధి కార్యాలయ సిబ్బంది, కూలీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అది శ్మశానం కాదు చెరువు పోరంబోకు

- 40 ఏళ్లుగా పూడ్చుతుంటే ఎక్కడికెళ్లారు
- అధికారులను నిలదీసిన ప్రజలు



రెవెన్యూ అధికారులను నిలదీస్తున్న న్యూ బోయనపల్లె వాసులు

రాజంపేట : మండలంలోని న్యూ బోయనపల్లెలో శ్మశాన సర్వే వివాదానికి దారితీసింది. శుక్రవారం సర్వేకు వెళ్లిన రెవెన్యూ అధికారులను ప్రజలు నిలదీశారు. కలెక్టరు, సబ్‌కలెక్టర్, తహసీల్దార్లకు శ్మశాన ఆక్రమణలపై స్థానికులు వినతుల సమర్పించగా హద్దులు గుర్తించి, న్యాయం చేస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. తాజాగా తహసీల్దారు మున్నీ, ఆర్ఐ శేషంరాజు, మండల సర్వేయర్ సరోజ, సచివాలయ సర్వేయర్ సాయిలు ఇది చెరువుతోటి పోరంబోకు అని ఇక్కడ మృతదేహాలను పూడ్చడం తప్పు అని చెప్పుకొచ్చారు. గత 40 సంవత్సరాలుగా తాము చనిపోయిన వారిని ఇక్కడే పూడ్చుతున్నామని, ఇప్పుడు ఇది శ్మశానం కాదని గుర్తుకు వచ్చిందా.. ఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడే భూస్థాపన చేస్తుంటే ఎక్కడిపోయారని అధికారులను నిలదీశారు. గతంలో శ్మశానానికి స్థలం కేటాయించాలని కోరినా స్పందించపోవడాన్ని తప్పుబట్టారు. ఇప్పుడు వచ్చి ఇది చెరువు భూమి అని చెప్పడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.

22న విద్యుత్ ఉద్యోగుల ప్రాంతీయ సదస్సు



కరపత్రాలను విడుదల చేస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు, కార్మికులు

రాయచోటి అర్బన్ : ఈనెల 22వ తేదీన కడపలో విద్యుత్ ఉద్యోగుల సమస్యల సాధన కోసం నిర్వహిస్తున్న రాయలసీమ జిల్లాల ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలంటూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వి.రమణ పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఆవరణలో ఆయన కార్మికులతో కలసి ప్రాంతీయ సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న 25వేల మంది కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. పర్మినెంట్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, అరియర్స్ ఇవ్వాలన్నారు. విద్యుత్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈనెల 22న కడపలో రాయలసీమ జిల్లాల సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు సదస్సుకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో యూఈసీడబ్ల్యూయూ డిస్కం అధ్యక్షుడు సుబ్రమణ్యం రాజు, యుఈఈయు జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప, అమర్నాదరెడ్డి, శ్రీనివాసులునాయుడు, ఖాదర్‌బాషా, డివిజన్ నాయకులు నగేష్‌గౌడ్, శ్రీనివాసులురెడ్డి, రామాంజులురెడ్డి, శ్రీధర్‌తోపాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా జెండా ఉరుసు



ఉరుసులో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల, నాయకులు

పుల్లంపేట : పుల్లంపేట మండలం తిరుమలయ్యగారిపల్లిలో కసిరెడ్డి రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన నాగుల్ మీరా జెండా ఉరుసు కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమరనాథరెడ్డి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కులమతాలు, పార్టీలకతీతంగా జెండా ఉరుసు కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషమని వారు పేర్కొన్నారు. ప్రజలందరికీ భగవంతుని ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. మాజీ ఎంపీటీసీ సుబ్బారెడ్డి, జోగి రవీంద్రరెడ్డి, జోగు సుధాకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డిలు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్ రెడ్డి, ఎం.శంకర్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, దండు గోపి, పెంచలయ్య, సుబ్బరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

8న జిల్లా రైతు సంఘం మహాసభ

రాయచోటి అర్బన్ : రైతుల సమస్యల పట్ల నిరంతరం రైతు సంఘం పోరాడుతుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జనవరి 8న జిల్లాస్థాయి రైతు సంఘం మహాసభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సభకు సంబంధించిన కరపత్రాలను సంఘం నాయకులతో కలసి ఆవిష్కరించారు. మహాసభలకు జిల్లాలోని రైతాంగం పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, నేతలు వేణుగోపాల్‌రెడ్డి, సలీం, సూరితోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోస్టల్ సిబ్బందికి సన్మానం



పదోన్నతి పొందిన వారిని సన్మానిస్తున్న అధికారులు

సుండుపల్లె : మండల కేంద్రంలోని పోస్టాఫీసులో పనిచేస్తున్న భాస్కర్, రెడ్డిశేఖర్, మునిరత్నంలు ఢిల్లీ పోస్టల్ సర్కిల్‌కు పదోన్నతిపై వెళ్తున్న సందర్భంగా పోస్టల్ సిబ్బంది కలిసి శుక్రవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.అమర్నాథ్, సుండుపల్లి పోస్టు మాస్టర్ సురేష్, పోస్టల్ యూనియన్ నాయకులు సుబ్రమణ్యం, మండల పరిధిలోని పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని మాధవరంపోడు హరిజనవాడకు చెందిన ఎంపీటీసీ ఏడుక మహేశ్వర తమ్ముడు నాగయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులు అర్పించి మృతుడి కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీకి సేవ చేసిన నాగయ్య మృతి తీరనిలోటన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



బాలలకు వైద్య పరీక్షలు చేస్తున్న ఏఎన్ఎం

చిట్వేలి : పాత చిట్వేలిలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ వైద్యులు అన్సారీ ఆదేశాల మేరకు ప్రధానోపాధ్యాయులు కె.వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ ఇస్మాయిల్ బాషాల ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాలల ఆరోగ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) నిర్వహించారు. ఇందులో భాగంగా బాలలకు ఆరోగ్యం, ఎత్తు, బరువులతోపాటు హెల్త్ చెకప్ చేసి హెల్త్ కార్డులు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కల్పన, ఏఎన్ఎం పద్మ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమకు అండగా ప్రభుత్వం

సిద్దవటం : రాష్ట్ర ప్రభుత్వం రైతల పాడి పరిశ్రమకు అండగా ఉంటుందని టీడీపీ నాయకుడు సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. సిద్దవటం మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని బంగారుపేటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గూండ్ల పెద్దసుబ్బరాయుడు రూ. 2.30లక్షలతో గోకుల షెడ్లను నిర్మించారు. శుక్రవారం ఈ షెడ్లను సుగవాసి బాలసుబ్రమణ్యం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లు పట్టివేత

రాజంపేట : కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి గీతావాణి ఆధ్వర్యంలో సిబ్బంది రాజంపేటలోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. మూడు హోటళ్లలో అక్రమంగా వినియోగిస్తున్న 13 వంట గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకొని హోటల్ యజమానులపై కేసులు నమోదు చేశారు. ఇళ్లల్లో సబ్సిడీతో వాడుకునే గ్యాస్ సిలిండర్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి హోటళ్లలో వినియోగించడం నేరమని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు.

స్టోర్ డీలర్ల నియామకంపై సందిగ్ధం!

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలో స్టోర్ల విభజనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 16 స్టోర్ డీలర్లను కొత్తగా ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా 24 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ ఆదివారం పరీక్షలు ఉండగా శుక్రవారం పాత డీలర్లు విభజన సరికాదంటూ కోర్టుకు వెళ్లి స్టే తెచ్చారు. కోర్టు పత్రాలను ఉన్నతాధికారులకు అందజేశారు. మొత్తానికి స్టోర్ కొత్తగా ఏర్పాటైన షాపులకు డీలర్ల నియామకం జరుగుతుందా లేదా అని పలువురు చర్చించుకుంటున్నారు.

అసంబద్ధ విద్యా విధానాలతో ఉపాధ్యాయులు బలి

పెనగలూరు : విద్యాశాఖలో ప్రభుత్వం తీసుకువస్తున్న అసంబద్ధ విధానాల వల్ల ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురై ప్రాణాలు కోల్పోతున్నారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం విద్యాశాఖ కార్యాలయం నుంచి ప్రశ్నాపత్రాలు తీసుకొని వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సిద్దయ్యశెట్టికి చక్రంపేట జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం ఉపాధ్యాయులు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ప్రభుత్వాలు ఉపాధ్యాయుల పట్ల మొండివైఖరి అవలంభిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతివారం ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరుగుతున్నా సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదని వాపోయారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం అన్వర్ బాషా, ఉపాధ్యాయులు మహేంద్ర, సుదర్శన్, శివ, నరసింహులు, కృష్ణకుమారి, ప్రమీల, పద్మజ, పరిమళ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

ఓబులవారిపల్లె : స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాలను నేడు శనివారం వేలం వేస్తున్నట్లు ఎస్ఐ పి.మహేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతబడ్డ నాలుగు కార్లు, ఆరు మోటారు సైకిళ్లు, స్క్రాప్ కింద వేలం వేస్తున్నామని, ఆసక్తి కలవారు ఈ వేలంలో పాల్గొనవచ్చని ఆయన తెలియజేశారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ట్రస్టు ప్రతినిధి

రామాపురం : క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని పోరుమామిళ్లకు చెందిన చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఫాండేషన్ ఫర్ చిల్డన్ ఇన్ నీడ్ సహకారంతో మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాల, సెయింట్ మేరీస్ ప్రాథమికోన్నత పాఠశాల, ఆర్‌సీఎం చర్చి పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన వృద్ధులు, విద్యార్థులకు సంస్థ ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, థామస్‌రెడ్డి, చిత్తా దంపతులు ఉచితంగా సుమారు 430 మందికి దుస్తులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్‌లు చిన్నప్ప, సురేష్, కస్తూర్బా గాంధీ పాఠశాల స్పెషల్ అధికారి పుష్పలత, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు



మాట్లాడుతున్న చర్చి నిర్వాహకులు

రైల్వేకోడూరు అర్బన్ : ఈనెల 25 న క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని స్థానిక లూథరన్ చర్చిలో వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు పాస్టర్ ఎస్. ఇమ్మానుయేల్, చర్చి కమిటీ చైర్మన్ పి.భాను శుక్రవారం తెలిపారు. చర్చిలో జరుగుతున్న విద్యుత్ అలంకరణ, భక్తులకు ఏర్పాట్లు తదితర పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 150 సంవత్సరాల పురాతన చర్చిలో క్రిస్మస్ వేడుకలు ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తామన్నారు. 24న సెమీ క్రిస్మస్, 25న క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే పిల్లలకు ఆటల పోటీలు, బైబిల్ పఠన పోటీలతోపాటు పలు క్రీడా కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు పంపిణీ చెయనున్నట్లు తెలిపారు.

బెటాలియన్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్‌ను కట్ చేస్తున్న నాగేశ్వరప్ప

సిద్దవటం : భాకరాపేట గ్రామ సమీపంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో శుక్రవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ నాగేశ్వరప్ప, టీడీపీ నాయకులు హరిప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పశువుల పాక వద్ద పాస్టర్ జాన్ లారెన్స్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇన్‌చార్జి కమాండెంట్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ థియోఫిలాస, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, టీడీపీ నాయకులు కుప్పాల వెంకటసుబ్బయ్య, చెంచయ్యనాయుడు, రాజశేఖర్, సుబ్బారెడ్డి, వెంకటక్రిష్ణ, రామ్మోహన్‌నాయుడు, పోలీసు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక రోడ్డును నిర్మించండి



ఆగిన పనులను పరిశీలిస్తున్న కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : వర్షాలకు కొట్టుకుపోయిన రెడ్డివారిపల్లి తాత్కాలిక రోడ్డును త్వరితగతిన నిర్మించాలని శుక్రవారం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. ఆయన ప్రజల రాకపోకల కోసం తాత్కాలికంగా గుంజనేరుపై నిర్మించిన రోడ్డును పరిశీలించారు. అలాగే కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెడ్డివారిపల్లి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. వర్షాలకు రోడ్డు కొట్టుకుపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే పనులు మొదలుపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, బుడుగు శివయ్య, చెంగల్‌రెడ్డి, సుబ్బరామరాజు, మండల శివయ్య, బండారు మల్లికార్జున, కరీముల్లా, శంకరయ్య, ప్రతాప్ రెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.